# పలువురు జిల్లా అధికారులు బదిలీ

## జడ్పీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలకు స్థానచలనం

వికారాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల బదిలీల్లో భాగంగా మూడేండ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పరిషత్ సీఈవో జానకీరెడ్డిని సంగారెడ్డికి పంపించగా.. నిర్మల్ జడ్పీ సీఈవో ముప్పూరి సుధీర్‌ను వికారాబాద్‌కు బదిలీ చేసింది. అదేవిధంగా డీఆర్‌డీవో ఎంఏ కృష్ణన్‌ను యాదాద్రిభువనగిరి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేయగా, మెదక్ డీఆర్‌డీవో శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు. డీపీవో తరుణ్‌కుమార్‌ను నిజామాబాద్‌కు పంపించగా.. అక్కడి డీపీవో జయసుధను ఇక్కడికి బదిలీ చేశారు. జడ్పీ డిప్యూటీ సీఈవో సుభాషిణిని రంగారెడ్డి జిల్లా అదనపు డీఆర్‌డీవోగా బదిలీ చేయగా, జనగామ డిప్యూటీ సీఈవో వసంతను జిల్లాకు పంపించారు. అదేవిధంగా జిల్లా అదనపు డీఆర్‌డీవో స్టీవెన్ నీల్‌ను ములుగుకు, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ నవీన్ చంద్రను సంగారెడ్డికి బదిలీ చేశారు. మేడ్చల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్‌ను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | VIKARABAD






అర్జీలను పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

# ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

## కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

రంగారెడ్డి, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు భూపాల్‌రెడ్డి, రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌లతో కలిసి వారు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో 149 ఫిర్యాదులు, వికారాబాద్ జిల్లాలో 127 ఫిర్యాదులు అందాయి. అనంతరం రంగారెడ్డి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు, మండల ఆధికారులు, మున్సిపల్ అధికారులందరూ రావాలని సూచించారు. రైతులు భూ సర్వేలకు సంబంధించి దరఖాస్తు చేసేటప్పుడు కలెక్టర్‌కు లేదా అదనపు కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలన్నారు.

**దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..**

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీసీ రోడ్ల పనులకు సంబంధించి వెంటనే గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన కులకచర్ల మండలానికి చెందిన విద్యార్థులకు కలెక్టర్ మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

# చలో నల్లగొండ

**ఎక్కడ చూసినా నల్లగొండ సభపైనే చర్చ**

**రంగారెడ్డి నుంచి రైతాంగం భారీగా తరలివెళ్లేలా బీఆర్‌ఎస్ శ్రేణుల ఏర్పాట్లు**

**వికారాబాద్ జిల్లా నుంచి ఆరు వేల మందికి పైగా..**

**ఒక్కో నియోజకవర్గం నుంచి 20 బస్సుల్లో తరలింపునకు సర్వం సిద్ధం**

**సాగునీటి హక్కులకోసం నేడు బీఆర్‌ఎస్ పోరుబాట**

వికారాబాద్ , ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : కృష్ణా ప్రాజెక్టులను కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగానే మంగళవారం నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నది. ఇటీవలే సభ నిర్వహణపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణభవన్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో సమావేశాన్ని నిర్వహించి ఉద్యమ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. జిల్లా నుంచి అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలివెళ్లేలా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు.

**కేసీఆర్ స్పీచ్‌పై సర్వత్రా ఆసక్తి ..**

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం అంటే ప్రతి ఒక్కరికీ ఆసక్తే. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి నిర్వహించిన అనేక సభలు, సమావేశాల్లో ఆయన ప్రసంగం అందరికీ ప్రేరణగా నిలిచింది. ప్రస్తుతం కేసీఆర్ నల్లగొండ సభలో పార్టీ శ్రేణులకు ఇచ్చే సంకేతాలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పరాధీనం చేయడంపైనే కేసీఆర్ ప్రసంగం ఉండనున్నది. కేఆర్‌ఎంబీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, తద్వారా తెలంగాణ ప్రయోజనాలకు కలగనున్న భంగం తదితర అంశాలను ఈ సభలో కేసీఆర్ ఎండగట్టనున్నారు. జిల్లాకు ప్రయోజనం చేకూర్చే రంగారెడ్డి–ఎత్తిపోతల పథకాన్ని పక్కకు పెట్టిన కాంగ్రెస్ వైఖరిని ప్రజలకు వివరించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం వల్ల రాబోవు రోజుల్లో సాగు, తాగునీటికి ఏర్పడనున్న ఇబ్బందులను ఈ సందర్భంగా ప్రజలకు వివరించనున్నారు. ఏది ఏమైనా ఎక్కడ చూసినా బీఆర్‌ఎస్ నల్లగొండ సభపైనే చర్చ జరుగుతున్నది.

**కదం తొక్కనున్న జిల్లా రైతాంగం..**

కేసీఆర్ నేతృత్వంలో నేడు నల్లగొండలో జరుగనున్న సభలో జిల్లాకు చెందిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్‌పర్సన్, కార్పొరేషన్ చైర్మన్లు, రైతుబంధు సమితి అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు కదం తొక్కనున్నారు. బస్సు లు, డీసీఎంలు, కార్లు తదితర వాహనాల్లో పెద్ద ఎత్తున జిల్లా ప్రజానీకం తరలివెళ్లేలా ఇప్పటికే బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యంగా రైతాంగం సభలో భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజానీకానికి బీఆర్‌ఎస్ పార్టీ చెప్పగలిగిందని, రైతులకు ఎవరు మేలు చేస్తున్నారో! ఎవరు కీడు చేస్తున్నారో! ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. నల్లగొండ సభ పార్టీ క్యాడర్‌లో కొత్త జోష్‌ను నింపి మున్ముందు చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణకు గొప్ప ప్రేరణను ఇస్తుందన్న ఆశాభావాన్ని పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

**వికారాబాద్ జిల్లా నుంచి ఆరు వేల మందికి పైగా..**

కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జిల్లాలోని బీఆర్‌ఎస్ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేశాయి. పదేండ్ల బీ ఆర్‌ఎస్ పాలనలో సాగునీటి హక్కులను కాపాడగా.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పజెప్పడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 80శాతం పూర్తైన పాల మూ రు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. సాగునీటి హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. నేడు నల్లగొండలో జరుగనున్న భారీ బహిరంగసభకు ప్రతి గ్రామం నుంచి రైతులు, ప్రజలు భారీగా తరలివచ్చేలా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 80 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 20 ఆర్టీసీ బస్సుల్లో ఆరు వేలకు పైగా బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు తరలివెళ్లనున్నారు. మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్ తదితర నాయకులు వంద కార్లలో సభకు తరలివెళ్లనున్నారు.





# ఫిబ్రవరిలోనే 6.5 కోట్లు

**రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం**

**మండుతున్న ఎండలు..**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): మండుతున్న ఎండలతో గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత ఉండడంతో అదే స్థాయిలో కరెంటు వినియోగం పెరుగుతున్నది. ఈ నెల 8న 65 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగిందని అధికారులు తెలిపారు. అదే సమయంలో గతేడాది ఫిబ్రవరిలో 55 మిలియన్ యూనిట్లకు మించలేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే రికార్డు స్థాయిలో ఉందని, ఇలానే ఉంటే 70 మిలియన్ యూనిట్లు దాటే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. గతేడాది ఏప్రిల్–మే నెలల్లో అత్యధికంగా 80 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైతే ఈసారి మాత్రం మార్చి, ఏప్రిల్ నెలల్లో దాన్ని అధిగమించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడానికి ఎండల తీవ్రతకు తోడు కొత్త కనెక్షన్లు కూడా మరో కారణమన్నారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో కొత్త ఇండ్ల నిర్మాణాలతో పాటు భారీ హౌసింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు పెరుగుతుండడంతో విద్యుత్ డిమాండు వేసవి సీజన్‌లో అత్యధికంగా నమోదవుతున్నదని తెలిపారు. డిమాండుకు అనుగుణంగానే సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ క్షేత్ర స్థాయిలో వేసవి కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# హెల్మెట్ ధరించడం వల్లే.. ప్రాణాలతో ఉన్నా

**హీరో సాయి ధరమ్‌తేజ్.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన**



ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న హీరో సాయిధరమ్ తేజ్, చిత్రంలో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12: తాను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డానని, హెల్మెట్ ధరించడం వల్లే ప్రాణాలతో ఉన్నానని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించకుండా తమ ఫోన్లలో వీడియోలు తీయడం చాలా బాధాకరమని, అలాంటి సమయాల్లో వ్యక్తి ప్రాణాలు కాపాడాలని.. వీడియోలు తీస్తూ అత్యంత కీలకమైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజ్‌లో నగర పోలీసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, హీరో సాయిధరమ్ తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి ధరమ్‌తేజ్ మాట్లాడుతూ..రోడ్డుపై వాహనాలు నడిపించే వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గించుకోవచ్చని, ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువతే మృత్యువాత పడుతున్నదని, ట్రాఫిక్ నియమాలపై ఏ మాత్రం అవగాహన లేకపోవడంతో పాటు అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ఏటా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ విజయ్‌కుమార్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావేద్, అమీర్ జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# రోజుకో మలుపు

**16న బలపరీక్ష నిర్వహిస్తాం**

ఈనెల 16న ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష నిర్వహిస్తాం. ఇప్పటికే విశ్వాస పరీక్షకు హాజరు కావాలని కౌన్సిలర్ల కు నోటీసులను పంపించడం జరిగింది. బలపరీక్షలో నెగ్గాలంటే 16 మంది సభ్యులు హాజరు కావాలి. లేకపోతే అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటిస్తాం. -అనంతరెడ్డి, ఆర్డీవో ఇబ్రహీంపట్నం

**రక్తికట్టిస్తున్న ఇబ్రహీంపట్నం మున్సిపల్ అవిశ్వాసం**

**విశ్వాసపరీక్షలో నెగ్గేందుకు వ్యతిరేక వర్గానికి తగ్గిన మ్యాజిక్ ఫిగర్**

**బలపరీక్షకు ముందే చైర్‌పర్సన్ వర్గంలో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు**

**తన వర్గంతో ప్రత్యేక క్యాంపునకు కప్పరి స్రవంతి**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఈనెల 16న చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష జరుగాల్సి ఉన్నది. 17మంది కౌన్సిలర్లతో బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన విషయం తెలిసింది. మొత్తం 24 మంది కౌన్సిలర్లలో విశ్వాస పరీక్షను నెగ్గాలంటే 16 మంది సభ్యుల మద్దతు అవసరం. 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టడంతో ఆమె పదవి నుంచి దిగడం ఖాయమని బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ధీమాగా ఉన్నా రు. గత 20 రోజులుగా వారు క్యాంపునకు వెళ్లారు. అయితే క్యాంపులో ఉన్న ఇద్దరు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ వర్గం వైపు వెళ్లారు.

**జంప్ అయిన శంకరయ్య, జెర్కోని బాలరాజు..**

అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టిన ఖానాపూర్ గ్రామానికి చెం దిన కౌన్సిలర్ శంకరయ్య, ఇబ్రహీంపట్నంలోని 24వ వార్డు కౌన్సిలర్ జెర్కోని బాలరాజు సోమవారం బీఆర్‌ఎస్, బీజేపీ వర్గం నుంచి చైర్‌పర్సన్ స్రవంతి వర్గం వైపు జంప్ అయ్యారు. దీంతో బలపరీక్షలో విజయం సాధించేందుకు అవసరమైన సంఖ్యాబలం చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గానికి లేకుండా పోయింది. ఆ వర్గంలో ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉన్నారు. చైర్‌పర్సన్ వర్గం వైపు ఆమెతోపాటు ఎనిమిది మంది సభ్యులున్నారు. దీంతో కప్పరి స్రవంతికి పదవిగండం తప్పినట్లైంది. చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన సభ్యులు ప్రత్యేక క్యాంపుకెళ్లారు. ఈనెల 16వరకు అక్కడే ఉండనున్నారు.



తన మద్దతు దారులతో కలెక్టర్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ స్రవంతి...

**రక్తికట్టిస్తున్న రాజకీయం..**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం రక్తికట్టిస్తున్నది. ఆమెను పదవి నుంచి దించేందుకు వ్యతిరేక వర్గం వారు నెలరోజులుగా పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశీస్సులతో పదవిని కాపాడుకునేందుకు చైర్‌పర్సన్ అనేక ఎత్తులు వేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన కౌన్సిలర్ శంకరయ్య అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. క్యాంపులో ఉన్న శంకరయ్య ఆదివారం మంచాల మండలంలోని రంగాపూర్‌లో తన అత్తగారి అంత్యక్రియలకు హాజరు కాగా.. ఆ విషయం తెలుసు కున్న చైర్‌పర్సన్ వర్గం వారు అక్కడి నుంచి ఆయన్ను తీసుకెళ్లారు. దీంతో శంకరయ్య కుమారులు తమ తండ్రిని చైర్‌పర్సన్ వర్గం కిడ్నాప్ చేసిందని మంచాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వెంటనే శంకరయ్య నగరంలోని చైతన్యపురి పీఎస్‌కు వెళ్లి తనను ఎవరు కిడ్నాప్ చేయలేదని.. ఇష్టంతోనే వెళ్లినట్లు వాగ్మూలం ఇవ్వడంతో పోలీ సులు కేసును కొట్టేశారు. అదేవిధంగా ఆదివారం రాత్రి మరో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ జెర్కోని బాలరాజు ఇంటికెళ్లి వస్తానని చెప్పి చైర్‌పర్సన్ స్రవంతి వర్గంలో చేరారు. రెండు రోజుల క్రితం వరకు స్రవంతి చైర్‌పర్సన్ గద్దె నుంచి దిగడం ఖాయమని అందరూ భావించారు. కానీ ఆమె ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ కౌన్సిలర్లను తన వర్గంలో చేర్చుకుంటూ పదవిని కాపాడుకుంటున్నారు.